చేప పిల్లల పంపిణీ

మందమర్రిరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మత్స్యకారులకు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీ డీవో సత్యనారాయణ చేప పిల్లలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలని వంద శాతం రాయితీతో చేప పిల్లలను పంపిణీ చేస్తుందన్నారు. చేప పిల్లలను పెంచి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మండలంలోని 15 చెరువుల్లో 4.71 లక్షల చేపపిల్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం సభ్యులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు నోముల ఉపేందర్ గౌడ్, గందె రాంచందర్, జీవన్‌కుమార్, గుడ్ల రమేష్, కొమురయ్య, చంద్రకళ పాల్గొన్నారు.

అర్చక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

జైపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేలాల శ్రీ గట్టు మల్లన్న స్వామి దేవాలయంలో ఖాళీగా ఉన్న అర్చక పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆలయ ఈవో రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ మతస్థులై, స్మార్థ ఆగమ, సత్ప్రవర్తన కలిగిన బ్రాహ్మణ అభ్యర్థులు డిసెంబర్ 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దేవాలయం కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. 18 నుంచి 38 ఏళ్ల అభ్యర్థులు అర్హులు.

ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు

మంచిర్యాల క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ బాల బాలికల ఎంపిక పోటీలు ఈ నెల 23 ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి జూనియర్ బాల బాలికల ఎంపిక పోటీలను ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియ దర్శిని స్టేడియంలో నిర్వహిస్తామని, ఎంపికైన క్రీడాకారులు సిరిసిల్లలో ఈ నెల 29న జరగబోయే తెలంగాణ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని అధ్యక్షుడు నల్ల శంకర్, ప్రధాన కార్యదర్శి మైలారం శ్రీనివాస్‌లు సంయుక్త ప్రకనటలో తెలిపారు. 1.1.2008 తర్వాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని, పూర్తి వివరాలకు 9959701878లో సంప్రదించాలని తెలిపారు.

ఇంటింటా భగీరథ నీళ్లు అందిస్తాం...

జన్నారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా భగీరథ నీరు అందిస్తామని మిషన్ భగీరథ ఇంజనీర్ ఎస్ఈ రవీందర్ అన్నారు. గురువారం మండలంలోని కలమడుగు, రోటిగూడ, బంగారుతండ గ్రామాలను సందర్శించారు.

ఈ సందర్భంగా ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు అందేలా చూస్తామన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందేలా మిషన్‌భగీరథ అందజేస్తామన్నారు. ఇప్పటికీ నీరు సక్రమంగా అందుతుందా లేదా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఈఈ వెంకటేశ్, ఏఈఈ నందన్‌వర్మ ఉన్నారు.



జగిత్యాల-మంచిర్యాల హైవేకు

రైట్..రైట్..

- రూ. 2550 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం
- ఇప్పటికే అటవీ, పర్యావరణ అనుమతులు మంజూరు
- నాలుగో ప్యాకేజీ కింద రహదారి విస్తరణ
- జిల్లాలో 35.39 కిలో మీటర్ల మేర బ్రౌన్ ఫీల్డ్‌కు గ్రీన్ సిగ్నల్

మంచిర్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల-మంచిర్యాల నేషనల్ హైవేకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇప్పటికే కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల నుంచి అనుమతులు రాగా, తాజాగా రహదారి నిర్మాణానికి అవసరమైన రూ. 2550 కోట్లు కేటాయించింది. దీంతో ఇంతకాలం సందిగ్ధంలో ఉన్న జాతీయ రహదారి (ఎన్‌హెచ్) -63కు ఎట్టకేలకు గ్రీన్ లభించగా, త్వరలో కాంట్రాక్టింగ్ పూర్తి చేసుకొని, పనులు ప్రారంభం కానున్నాయి. ఎన్‌హెచ్-63ను కేంద్రం నాలు గు వరుసలుగా విస్తరిస్తుండగా, గరిష్ఠంగా మూడేళ్లలో ఈ రహదారి అందుబాటులోకి రానుంది. ఈ రోడ్డు మ హారాష్ట్రలోని దొండ్ వద్ద మొదలై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ మీదుగా 1,065 కిలో మీటర్లు కొనసాగి ఒడిశాలోని కోరాపుట్‌లో ముగుస్తుంది. తెలంగాణలో బోధన్- నిజా మాబాద్-ఆర్మూరు-మెట్‌పల్లి-కోరుట్ల-జగిత్యాల-రాయపట్నం-లక్షెట్టిపేట-మంచిర్యాల-చెన్నూరు మీదుగా సాగుతుంది. లక్షెట్టిపేట మీదుగా సాగుతున్న రహదారి గడ్డె రాగడి వద్ద చంద్రాపూర్-ఛత్తీస్‌గఢ్ ఎన్‌హెచ్ 363కి అనుసంధానం కానుంది. ఈ రహదారి ఆర్మూరు- మంచి ర్యాల వరకు రోడ్లు, పట్టణాలు, గ్రామాల మీదుగా కొనసాగుతున్నందున గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మించాలని తొలుత నిర్ణయించినప్పటికీ, అందుకు భారీగా భూ సేకరణ జరపాల్సి ఉండటం, భూములు ఇచ్చేందుకు రైతులు ససేమిరా అనడంతో అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు చేశారు. ప్రస్తుతం ఊళ్లున్న ప్రాంతాల్లో బైపాస్‌లు నిర్మించి, మిగతా పాత రోడ్డును విస్తరించేలా ప్ర ణాళిక రూపొందించారు. ఆర్మూరు నుంచి మంచిర్యాల వరకు రోడ్డు 131.8 కిలోమీటర్ల పొడవు ఉండనుండగా, రాయపట్నం నుంచి మంచిర్యాల వరకు 35.39 కి.మీ. మేర నిర్మాణం జరుగనుంది. రహదారి నిర్మాణం నా లుగు విడుతలుగా చేపట్టనుండగా నాలుగవ విడుత లో రాయపట్నం-మంచిర్యాల వరకు సాగనుంది.

రైతుల ఆందోళనతో...

ఎన్‌హెచ్-63 కోసం అధికారులు మూడు దఫాలుగా రూట్ మ్యాప్‌లో మార్పులు చేశారు. మొదటి అలైన్ మెంట్ ప్రకారం కొందరు బడా బాబులకు నష్టం వాటి ల్లుతండటంతో వారి ఒత్తిడికి తలొగ్గి రెండో రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. అది లక్షెట్టిపేట నుంచి ముల్కల్ల వరకు పూర్తిగా నివాస గృహాల మీదుగా వెళ్తుంది. దీ నివల్ల సామాన్య ప్రజానీకానికి తీరని నష్టం కలిగేలా ఉంది. అష్టకష్టాలు పడి..

(తరువాయి 7లో)

మొదటి అలైన్‌మెంట్ ప్రకారమే నిర్మించాలి..

లగిశెట్టి రాజమౌళి, గుడిపేట



రహదారి నిర్మాణం మొదటి అలైన్‌మెంట్ ప్రకారమే చేపట్టాలి. ఇందులో రాజకీయ, పలుకుబడి, ఇతర ప్రలోభాలకు అవకాశం ఇవ్వకూడదు. రైతులు భూములు కోల్పోకుండా 2018లో రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం నిర్మాణం చేపడితే రైతులు అభ్యంతరం తెలిపే అవకాశం ఉండదు.

జీవనాధారం లేకుండా చేయొద్దు...: రమాదేవి, సూరారం



వ్యవసాయ భూములు సేకరించడం ద్వారా రైతు కుటుంబాలకు జీవనాధారం లేకుండా చేయొద్దు. మొ దటి అలైన్‌మెంట్ ప్రకారం పెద్దగా ప్రజలకు నష్టం ఏ మీ ఉండదు. బడా బాబులను దృష్టిలో ఉంచుకొని అ ప్పుడు రూట్‌మ్యాప్ మార్చారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందున మొదటి అలైన్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చి నిర్మాణం చేపట్టాలి.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్

శ్రీరాంపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్ మండలం తాళ్లపల్లి ఇసుక క్వారీని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారుల సౌకర్యార్థం ప్రభుత్వం ఇసుక క్వారీలు ఏర్పాటు చేసిందన్నారు. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి నిర్ణీత రుసుమును స్వీకరించి రవాణా చేస్తుందన్నారు. నిరుపేదల కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా అందిస్తామన్నారు.

ప్రభుత్వ అభివృద్ధి పనులకు సైతం ఇసుక రవాణా చేస్తున్నామన్నారు. ఈ తరుణంలో అక్రమంగా రవాణా జరుగకుండా సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ తహసీల్దార్ సంతోష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

జైపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని టేకుమట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన డీసీఎంస్ కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

తూకం విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఆయన వెంట డీసీవో సత్యనారాయణ, రిజిస్ట్రార్ సందీప్‌కుమార్, ఏఈవో ప్రణీత, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రమేష్ ఉన్నారు.

కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు

కలెక్టర్ కుమార్ దీపక్



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండలంలోని గుడిపేట, నంనూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వం రైతుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని, ఈ క్రమంలో రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా కేంద్రాల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల సౌకర్యార్థం తాగు నీరు, నీడ, మౌలిక వసతులు కల్పించడంతో పాటు గన్నీ సంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు సమకూర్చామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. అనంతరం ముల్కల్ల శివారు గోదావరిలో ఏర్పాటు చేయనున్న ఇసుక రీచ్‌ను తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండేతో కలిసి పరిశీలించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్ కుమార్ దీపక్‌ను సన్మానిస్తున్న టీఎన్‌జీవోలు

మంచిర్యాల క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : టీఎన్‌జీవో మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కుమార్ దీపక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జల్ సంచాయ్, జన్ భాగీదారి 2025 అవార్డును అందుకున్న సందర్భంగా కలెక్టర్‌కు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయిలో మంచిర్యాల జిల్లాకు అవార్డులు రావడానికి జిల్లా ఉద్యోగుల సహకారం చాలా ఉందని, భవిష్యత్‌లో కూడా ఇంకా మంచిర్యాలకు మరిన్ని అవార్డులు సంపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రవన్ కుమార్, నాగుల గోపాల్, అజయ్, ప్రశాంత్, వెంకటేష్, గంగారాం పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ : కేంద్ర జలశక్తి జాతీయ స్థాయి జల పురస్కారాల్లో భాగంగా జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన కలెక్టర్ కుమార్ దీపక్‌ను గురువారం అధికారులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, డీఆర్‌డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, అధికారులు దుర్గా ప్రసాద్, రౌఫ్‌ఖాన్, ఎంపీపీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే షీటీం

సీఐ నరేష్ కుమార్

మంచిర్యాల క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రత కోసమే షీటీం పని చేస్తుందని మంచిర్యాల మహిళా పోలీస్ సీఐ నరేష్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఆల్ఫోర్స్ స్మార్ట్ హై స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు డ్రగ్స్, షీటీంపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వల్ల విద్యార్థుల భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. సైబర్ క్రైం జరిగినప్పుడు 100కు గాని, 1930కు గాని కాల్ చేయాలని, ఇంటి వద్ద తల్లిదండ్రులకు కూడా ఈ విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హైమ, కానిస్టేబుల్ శ్రవణ్, జ్యోతి, సతీష్, శ్రీలత, శైలజ, పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయండి



ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌కు వినతిపత్రం అందిస్తున్న మున్నూరుకాపులు

జన్నారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ క్యాంప్ ఆఫీసులో కలిసి శాలువాతో సన్మానం చేసి మండల సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మణ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో సెంట్రల్‌లైటింగ్‌తో పాటు మురికి కాలువల నిర్మాణం చేపట్టాలని అన్నారు. అదే విధంగా మున్నూరు కాపు సంఘం భవనం నిర్మాణానికి సహకరించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు లెక్కల మల్లయ్య, నాసాని శ్రీనివాస్, కస్తూరి భూమన్న, శ్రీనివాస్, బొడ్డు రామన్న, బూతం శ్రీనివాస్, జలపతి, పూదరి నర్సయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

వందేమాతరం గీతం ఆలాపన



వందేమాతర గీతం ఆలపిస్తున్న బీజేపీ నాయకులు

దండేపల్లి నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలందరిని ఏకతాటిపైకి తెచ్చి వారిని మమేకం చేసేందుకే వందేమాతరం గీతమని బీజేపీ రాష్ట్ర నాయకులు, మంచిర్యాల మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముకేష్‌గౌడ్. మండల అధ్యక్షుడు బందెల రవిగౌడ్‌లు అన్నారు. వందేమాతం రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురు వారం దండేపల్లి బస్టాండ్‌లో గాంధీ విగ్రహం వద్ద స్థానిక ప్రజలతో కలిసి బీజేపీ నాయకులు సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, కిషన్, అశోక్, రవిందర్, శంకరయ్య, విజయచందర్, సురేందర్, సత్తయ్య, మల్లేష్, లచ్చన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశ భవిష్యత్

దండేపల్లి నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు నిర్మాణం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, ఒక విద్యార్థి భవిష్యత్తు ఉపాధ్యాయుడి వల్లే సాధ్యమని తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంఈవో మంత్రి రాజులు అన్నారు. రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరులో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటిలలో గెలుపొందిన విద్యార్థులకు గురువారం దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బహుమతులు ప్రధానం చేశారు. వారు మాట్లాడుతూ మానవత విలువలు, పరిచయంతో విద్యార్థులలో పెంపొందించడానికి ఇలాంటి వ్యాసరచన పోటీలు ఎంతో దోహదపడుతాయన్నారు. విద్యార్థి దశ నుంచి చక్కని క్రమశిక్షతో కూడినటువంటి విద్యను అభ్యసించడం ద్వారా భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు నైతిక మానవతా విలువలను తెలుసుకుంటు ఆచరించడానికి విద్యార్థులు ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంగర్స్ రాజేశ్వర్‌రావు, ఆర్‌ఐ భూమన్న, సేవా సమితి జోనల్ ఇన్‌చార్జి గంప రవీందర్, కన్వీనర్ చెట్టుపల్లి రమేష్, యూత్ ఆర్డినేటర్ వై శ్రీనివాస్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార సంఘం ఉత్తమ అవార్డు

జన్నారం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): 72వ ఆలిండియా కోఆపరేటివ్ సహకార సంఘం వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని డీసీవో కార్యాలయంలో జరిగిన ఉత్తమ సహకార సంఘం అవార్డును మండల సహకార సంఘం చైర్మన్ అల్లం రవి, డీసీసీబీ చైర్మన్ బుక్య వెంకన్న చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీవో సంజీవరెడ్డితో పాటు సహకార సంఘం సభ్యులు ఉన్నారు.

పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేపట్టాలి

మందమర్రిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బీసీల 42శాతం సంబంధించి పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లును సత్వరమే చేపట్టాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా అధ్యక్షులు నరేడ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సింగరేణి పాఠశాల మైదానంలో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో చాయ్‌పేచర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 42శాతం రిజ్వేషన్లు అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. భారతరాజ్యాంగా ఇప్పటి వరకు 130సార్లు సవరణ చేశారని తెలిపారు. ఉద్యమాలు లేకుండా అగ్రకులాలకు బారత రాజ్యాంగంలో ఆర్టికల్ 103 ఆధారంగా ఐదు రోజుల్లోనే సవరణ చేసి పదిశాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లు కల్పించారన్నారు. తమకు న్యాయమైన డిమాండ్ కోసం రాజ్యాంగం సవరణ చేస్తే తప్పేమిలేదన్నారు. 40 ఏళ్లుగా బీసీలకు ఉద్యోగ, విద్యా, ఎన్నికల్లో తీరని అన్యాయం జరుగుతోందన్నారు. దీని కోసం తాము ఎలాంటి త్యాగాలకైన సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, బీసీ సంఘం నాయకులు సలేంద్ర సత్యనారాయణ, ఎండీ అబ్బాస్, సదానందం, చిలగాని సుదర్శన్, బొజ్జ సాగర్, రాజేందర్, జనార్ధన్, రవీందర్, శీలం మహేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సమాజ్ నాయకులు

సాధనతో ఉపకారం



- 23న ఎన్ఎంఎంఎస్ పరీక్ష
- సన్నద్ధమవుతున్న విద్యార్థులు

కోటపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యలో ఆర్థిక తోడ్పాటునందించడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాలు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) అందజేస్తుంది. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు యేటా పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తుంది. ఇందులో భాగంగానే 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 23న పరీక్ష నిర్వహించనున్నారు.

ఉపకారం ఇలా...

ఎంపికైన విద్యార్థులకు ప్రతి యేటా రూ. 12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు అందించనున్నారు. 9, 10, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం వరకు మొత్తం రూ. 48 వేలు అందించనుండడంతో..

(తరువాయి 7లో)

ఉపాధ్యాయుల సూచనలతో

పెల్లి సంకర్తీన



ఉపకార వేతన పరీక్షకు మేము ఉపాధ్యా యుల సూచనలు పాటిస్తున్నాం. మొదటి వి భాగంలో ఉండే మానసిక సామర్థ్య పరీక్ష (మెంటల్ ఎబిలిటి)కి 90 ప్రశ్నలు ఉంటాయి. వీటిని బాగా ప్రాక్టీస్ చేస్తున్నాం. రీజనింగ్, ఎబిలిటీస్, సంఖ్యాశాస్త్రం, పదాల భిన్న పరీక్ష, నెంబర్‌అనాలజీ, అల్ఫాబెట్ అనాలజీ, కోడింగ్, డీకోడింగ్, లాజికల్ ప్రశ్నలు, వెన్ చిత్రాలపై బాగా ప్రాక్టీస్ చేస్తున్నాం.

పాత ప్రశ్నపత్రాలతో సాధన

అనూష



గణితం, భౌతిక, రసాయన, జీవశాస్త్రం కలిపి మ ల్టీపుల్ చాయిస్ రూపంలో ప్రశ్నలను సాధన చేస్తున్నాం. వీటిని ప్రత్యేక తరగతుల ద్వారా, ఉపాధ్యా యులు అందించిన పాత ప్రశ్న పత్రాలను సాధన చేస్తున్నాం. ప్రత్యేక తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతున్నాం. వారి సూచనలతోనే ప్రతిభ చాటేందుకు పరీక్షలకు సిద్ధమవుతున్నాం.

ఏర్పాట్లు పూర్తి ..

డి. దామోదర్‌రావు, అసిస్టెంట్ కమిషన్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినర్



జిల్లాలో ఈ నెల 23న నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. 1094 మంది విద్యార్థులు దరఖాస్తులు చేశారు. సీఎస్, డీవో, ఇన్విజిలేటర్ల నియామకంపై కసరత్తు జరుగుతుంది. పరీక్ష రాసే విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడంతో పాటు సాధన చేస్తే ఉపకార వేతనం సులువుగా అందుతుంది.

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి

మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి

రామకృష్ణాపూర్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. గురువారం రామకృష్ణాపూర్ సింగరేణి ఠాగూర్ స్టేడియంలో అండర్-14 బాలబాలికల, అండర్-17 బాలబాలికల బాస్కెట్ బాల్ జిల్లా, జోనల్ స్థాయి పోటీలను ప్రారంభించేందుకు వచ్చిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. ఎస్‌జీఎఫ్ మంచిర్యాల, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సెక్రటరీ పిన్నింటి రఘునాథరెడ్డి, బాస్కెట్‌బాల్ సెక్రటరీ ఫ్రాన్సిస్, మంచిర్యాల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ యాకూబ్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు అవసరమని క్రీడల్లో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాలన్నారు. వ్యాయమ ఉపాధ్యాయ సంఘం సెక్రటరీ శ్రీనివాస్, వ్యాయమ ఉపాధ్యాయులు దుబ్బ శ్రీనివాస్, వహిదా బేగం, విజయ్, సంతోష్, మల్లిక పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ శశిదర్ రెడ్డి

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాల క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రైల్వే స్టేషన్ సమీపంలో తెల్లవారు జామున రైలు ఢీకొనడంతో మృతి చెందాడని, అతడికి సుమారు 55 ఏళ్లు ఉంటాయని, మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 8328512176 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం ఎల్లారం గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు గురువారం తెల్లవారు జామున దాడి చేసి పేకాట ఆడుతున వారి నుంచి రూ.4,400 నగదు స్వాధీన పర్చుకుని పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. దాడిలో ఎస్సై రాజు, సిబ్బంది మహ్మద్, విజయ్, రమేష్, సంజీవ్, దేవేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): గూడెంఘాట్, తుంబపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను గురువారం సాయంత్రం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. నిందితుల నుంచి రూ.9,600 నగదు స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు పట్టుబడిన వారిని పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. దాడిలో ఎస్సై రాజు, కానిస్టేబుళ్లు రాజ్‌కుమార్, కళ్యాణ్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

వట్టివాగు కాలువ కింద రైతులు పంటలు వేసుకోవద్దు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వట్టివాగు కుడి ప్రధాన కాలువ కింద ఉన్న ఆయకట్టు రైతులు యాసంగిలో పంటలను వేసుకోవద్దని వట్టివాగు ప్రాజెక్టు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కుడి ప్రధాన డిస్ట్రిబ్యూటరీ నుంచి పూడిక తీయడానికి టెండరు ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. నీటి విడుదలపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోని కారణంగా రైతులు పంటలు వేసుకో వద్దని సూచించారు. ఉన్నతాధికారులను సంప్రదించి నీటి విడుదలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

పని చేయని జనరేటర్లు

● ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలకు అంతరాయం
● సిబ్బందికి తప్పని ఇబ్బందులు
● పట్టించుకోని ఉన్నతాధికారులు

వాంకిడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కోతల సమయంలో కార్యాలయాల్లో పనులకు ఆటంకం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు అందజేసిన జనరేటర్లు పని చేయడం లేదు. పనులు దక్కించుకున్న గుత్తేదారు ఆయా కార్యాలయాలకు జనరేటర్లు అప్పగించి చేతులు దులుపుకున్నారు. అధికార యంత్రాంగం సైతం వీటిని వినియోగంలోకి తీసుకురాక పోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. కొన్ని కార్యాలయాల్లో యంత్రాలకు తుప్పు పట్టగా మరికొన్ని కార్యాలయాల్లో నిరుపయోగంగా మారాయి. దీంతో రూ. లక్షల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. వర్షాకాలంలో తరచూ విద్యుత్‌లో అంతరాయం కలుగుతూ గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమయంలో ఆన్‌లైన్ సమస్యలతో కార్యాలయంలో పనులు నిలిచిపోతున్నాయి. కొన్నేళ్ల నుంచి జనరేటర్లు నిరుపయోగంగా ఉన్నా ఉన్నతాధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

జిల్లా వ్యాప్తంగా నిరుపయోగం..

జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో పంపిణీ చేసిన జనరేటర్లు నిరుపయోగంగా ఉన్నాయి. విద్యుత్ కోతల సమయంలో కార్యాలయాల్లో పనులకు తీవ్ర ఆటంకం కలుగుతుందని సిబ్బంది వాపోతున్నారు. జనరేటర్లు పనిచేయక నిరుపయోగంగా ఉండడంతో ఇన్వర్టర్లు ఏర్పాటు చేసినా ఆన్‌లైన్ పనులు ఎక్కువ కావడంతో అవి ఎక్కువ సేపు నిలవడంలేదు. జిల్లాలో మంజూరి అయిన ప్రతి కార్యాలయంలో ఇదే పరిస్థితి నెలకొని ఉంది. జిల్లాలోని వాంకిడి, కౌటాల తదితర మండలలాల్లో ఏర్పాటు చేసిన జనరేటర్లు కార్యాల యాల బయట అలంకారప్రాయంగా మారాయి. పలు కార్యాలయాల్లో ఏర్పాటు చే సిన


వాంకిడి తహసీల్దార్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న జనరేటర్

అత్యవసర సమయంలో..

అత్యవసర సమయంలో విద్యుత్ కోతలతో ఇంటర్‌నెట్ సేవలు అందడంలేదు. రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ సమయంలో విద్యుత్ నిలిచిపోతే సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. జనరేటర్ నడిపించేందుకు డీజిల్, పర్యవేక్షణకు ఆపరేటర్, మరమ్మతులకు మేకానిక్‌లు అందుబాటులో ఉండాల్సి ఉంది. జనరేటర్ల నిర్వహణ కోసం ప్రభుత్వం ఆయా శాఖలకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో అధికారులు సొంతంగా ఖర్చులు వెచ్చించినా అవి వస్తాయో రావో తెలియని పరిస్థితి ఉందని చెబుతున్నారు.

జనరేటర్లుకు కనీసం షెడ్డు కూడా ఏర్పాటు చేయక పోవడంతో ఎండ కాలంలో ఎండుతూ వర్షాకాలంలో తడుస్తూ తుప్పుపట్టి పోయాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు కార్యాలయంలో అత్యవసర పనులు నిలిచిపోతున్నాయి. ప్రజలకు ధ్రువ పత్రాలు సకాలంలో అందక ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి నెలకొన్నది.

ఇన్వర్టర్లతోనే పనులు..
కవిత, వాంకిడి తహసీల్దార్

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఆన్‌లైన్ సేవల్లో అంతరాయం ఏర్పడకుండా ఇన్వర్టర్లను ఏర్పాటు చేశాం. వీటితో కార్యాలయంలో పనులు చేసుకుంటున్నాం. అప్రకటిత కోతలు ఉంటే, ఇన్వర్టర్లు నిలిచిపోతే ఏం చేయలేని పరిస్థితి ఉంటుంది. జనరేటర్ల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదించాం.

మరమ్మతులు చేయించాలి..
బండె తుకారాం, వాంకిడి మాజీ సర్పంచ్



ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన జనరే టర్లను ఉన్నతాధికారులు మరమ్మతులు చేయించాలి. లక్షల రూపాయలతో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన జనరే టర్లు నిరుపయోగంగా మారాయి. విద్యు త్‌లో అంతరాయం జరిగినప్పుడు ఆన్‌లైన్ పనులు సకాలంలో పూర్తి కావడం లేదు. దీంతో సిబ్బందితో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఆర్టీసీ బస్సులో పొగలు

అద్దాలు పగులగొట్టి దూకిన ప్రయాణికులు

హాజీపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటలో గురువారం ఆర్టీసీ బస్సులో నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు భయపడి అద్దాలు పగలగొట్టి అందులో నుంచి బయటకు దూకారు. జగిత్యాల జిల్లా కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (టీఎస్ 21జడ్ 0080) సాయంత్రం 6.30 గంటల సమయంలో మంచిర్యాల నుంచి 77 మంది ప్రయాణికులతో కోరుట్లకు బయల్దేరింది. హాజీపూర్ మండలం గుడిపేట దుబ్బపల్లికి చేరుకోగానే బస్సు వెనుక చక్రాల లైనర్లు పట్టుకోవడంతో ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. గమనించిన డ్రైవర్ వెంటనే బస్ పక్కకు ఆపాడు. పొగలు రావడాన్ని ప్రయాణికులు కూడా గమనించి భయాందోళనతో బస్సు కిటికీ అద్దాలు పగలగొట్టుకొని ఒకరిద్దరు బయటకు దూకారు. బస్సులో తొక్కిసలాట జరిగే అవకాశం ఉండడంతో అక్కడే ఉన్న స్థానికులు ప్రయాణికులకు అవగాహన కల్పిస్తూ ఒక్కొక్కరినీ కిందకు దించారు. ఈ సమాచారం అందుకున్న ఎస్సై స్వరూప్ రాజ్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రాయాణికులను ఇతర మార్గాల ద్వారా పంపించే ఏర్పాట్లు చేశారు.


హాజీపూర్ మండలం గుడిపేట వద్ద నిలిచిపోయిన బస్సు

పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ సుభాష్ పాటిల్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

ఆసిఫాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, డీజీపీ శివధర్‌రెడ్డి, ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీసీ ద్వారా గురువారం అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్‌లు, పంచాయతీ అధికారులతో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సిబ్బంది, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతి భద్రతల అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతవరణంలో సమర్ధవంతంగా నిర్వహించాలని చెప్పారు. సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని వీసీ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అదికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ సుభాష్ పాటిల్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, అదనపు ఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు, 2874 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ డెడికేషన్ కమిటీ నిబంధనల ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియ చేపడతామని అన్నారు. స్థానిక సంస్థల నిర్వహణకు ఎన్నికలలో అవసరమయ్యే సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఈ నెల 23 తేదీ వరకు స్వీకరిస్తామని, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి సిద్ధంగా ఉంచామని అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసే నిబంధనల ప్రకారం జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, డిప్యూటీ కలెక్టర్ జాస్తిన జోల్, జిల్లా ఆడిట్ అధికారి రాజేశ్వర్, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో మహిళా నైట్ వాచ్‌మెన్ పోస్టుతో పాటు తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల హస్టల్‌లో హెడ్‌కుక్ కాంట్రాక్టు పద్ధతిలో పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో సుభాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 28 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్లాట్ బుక్ చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు సీపీఐ కేంద్రాల వద్ద పత్తి అమ్మకానికి ముందుగా కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని ఏవో మిలింద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సెల్‌ఫోన్ నంబర్ ద్వారా స్లాట్ బుక్ చేసు కోవాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న తరువాత పత్తిని సీసీఐ కేంద్రాలకు తీసుకు రావాలని తెలిపారు. పత్తిలో తేమ శాతం 12కి మించి ఉండ కూడదని ఏవో సూచించారు.

వరకట్నం కోసం వేధించిన నలుగురిపై కేసు

నెన్నెల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదుకు చెందిన ఠాకూర్ దినేష్‌సింగ్ అతడి తల్లిదండ్రులు కవిత, రామ్‌చందర్‌సింగ్, సోదరుడు బితేష్‌సింగ్‌లపై నెన్నెల పోలీసులు గురువారం వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. ఎస్సై ప్రసాద్ చెప్పిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నెన్నెలకు చెందిన రణవీర్‌సింగ్ కూతురు నందినికి దినేష్‌తో 2023 జూన్ 5న వివాహం జరిగింది. వీరికి ఏడాది వయసున్న కొడుకు ఉన్నాడు. పెళ్లి సయమంలో మూడు తులాల బంగారం, రూ.1.50 లక్షలు కట్నం ఇవ్వాలని మగపెళ్లి వారు డిమాండ్ చేశారు. బంగారంతో పాటు అప్పుడు రూ. 50 వేలు మాత్రమే ఇవ్వగా మిగతా లక్ష రూపాయల కోసం భర్త నిత్యం వేధింపులకు గురిచేసేవాడు. లేనిపోని నిందలు వేస్తూ భర్తతో పాటు అత్తమామలు, బావ మానసికంగా వేధించేవారు. ఇంటర్ వరకు మాత్రమే చదివిన దినేష్ ఐటీ ఉద్యోగం చేస్తున్నట్టు లక్షల్లో జీతం ఉందని అబద్ధం చెప్పి మోసగించి పెళ్లి చేసుకున్నాడని నందిని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

గాయపడిన లేగదూడకు చికిత్స


చికిత్స చేస్తున్న స్థానిక యువకులు

కాసిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ లారీ యార్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో లేగదూడ తీవ్ర గాయాలపాలైంది. గమనించిన స్థానిక యువకులు స్పందించి లేగదూడకు ప్రథమ చికిత్స అందించారు. దేవాపూర్ లారీ యార్డులో తిరుగుతున్న పశువులను భారీ వాహనాలు వచ్చి ఢీకొట్టడంతో మృతిచెందుతున్నాయి. గురువారం లేగదూడను వాహనం ఢీకొట్టడంతో గాయాలపాలైంది. స్థానిక యువకులు వెంటనే స్పందించి ప్రథమ చికిత్స చేసి మూగజీవి ప్రాణాలు కాపాడారు. మేజర్‌గ్రామపంచాయతీలో పశువైద్యశాల ఉన్నప్పటికీ సిబ్బంది లేకపోవడం పట్ల యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి పశువైద్య సిబ్బందిని నియమించాలని కోరారు. యువకులు పొలవేని పోశం, కలవేని రమేష్, రామిళ్ల దిలీప్, ఉప్పులేటి ప్రవీణ్, కుమ్మరి శ్రీనివాస్, అంజి పాల్గొన్నారు.

ఆస్పత్రిలో బాలుడి మృతి

వైద్యుడి నిర్లక్ష్యం వల్లేనని బంధువుల ఆందోళన


మృతి చెందిన కార్తీక్

మంచిర్యాల క్రైం/కాసిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల బాబుకు జలుబు చేసిందని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పిల్లల ఆసుపత్రికి వెళితే చివరికి బాబు ప్రాణాలు పోవడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. జగిత్యాల జిల్లా రాంపూర్‌కుచెందిన శేఖర్-సౌందర్య దంప తుల కుమారుడు కార్తీక్ (3 నెలలు). సౌందర్య తల్లి ఊరు కాసిపేట మండలం కొండాపూర్ యాప కావడంతో కుటుంబ సభ్యులతో వారం రోజుల క్రితం కొండాపూర్ యాపకు వచ్చాడు. చలి తీవ్రతతో కార్తీక్‌కు జలుబు చేసింది. సోమవారం ఉదయం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రైవేటు పిల్లల ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరిస్థితి విషమించిందని ఆసుపత్రిలో చేర్పించుకున్నారు. రోజుకు రూ. 12 వేల బిల్లు వేసి డబ్బులు తీసుకున్నారు. బుధవారం రాత్రి బాబు మృతిచెందినప్పటికీ బాబు బతికి ఉన్నట్లుగా వైద్యం చేసి మరికొన్ని డబ్బులు వసూలు చేశారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువా రం ఉదయం వరకు తమకు చెప్పకుండా వైద్యం చేయడంపై అనుమానం వచ్చి ఆసుపత్రి సిబ్బందిని నిలదీయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే బాబు మృతిచెందాడని తల్లిదండ్రులు, కుటుంబీకులు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్‌రావు ఘటన స్థలానికి చేరుకొని బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు నచ్చ చెప్పారు. ఈ విషయమై వైద్యుడిని వివరణ కోరగా శ్వాస సమస్యతో చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చారని, సరియైన వైద్యం అందించినప్పటికీ గుండెకు సంబంధించి హిడెన్ అనే సమస్యతో మృతి చెందాడని తెలిపారు. బాలుడికి వైద్యం అందించడంలో తమ నిర్లక్ష్యం ఏమీ లేదన్నారు.


ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

బొగ్గు నాణ్యతలో మూడో బహుమతి

మందమర్రిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఇటీవల నిర్వహించిన బొగ్గు నాణ్యత వారోత్సవాల సందర్భంగా మందమర్రి ఏరియాకు బొగ్గు నాణ్యత ప్రమాణాలలో మందమర్రి ఏరి యాకు మూడో బహుమతి సాధించింది. ఈ సందర్భంగా అట్టి బహుమతిని సింగరేణి సీఎండీ చేతుల మీదుగా జీఎం రాధాక్రిష్ణ, క్వాలిటి మేనేజర్ ప్రదీప్‌కుమార్ హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ బల్‌రాం చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా 12 ఏరియాల్లో మూడో బహు మతి సాధించడం గొప్ప విషయమన్నారు. మార్కెట్‌లో నాణ్యమైన వస్తువులకే మంచి రేటు ఉంటుందని మన బొగ్గుకు అదే రేటు లభించాలంటే నాణ్యత ప్రమానాల్లో అందరూ కృషి చేయా లని కోరారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే నాణ్యతో సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మందమర్రి క్వాలిటి డిపార్టుమెంటును, అధికారులను ప్రత్యే కంగా అభినందించారు. ఈ సందర్భంగా మందమర్రి జీఎం రాధాక్రిష్ణ మాట్లాడుతూ ఇది అందరి విజయమని తెలిపారు. అవా ర్డుతో బాధ్యత పెరిగి ందని అన్నారు. మొదటి స్థానంలో నిలిపేందుకు ఉద్యోగులు పాటుపడాలని సూచించారు.


సీఎండీ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న జీఎం రాధాక్రిష్ణ

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి


పదోన్నతి పత్రాలు అందజేస్తున్న మేనేజర్ ఆత్మారామ్ సాహ్నీ

శ్రీరాంపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని ఎస్‌ఆర్‌పీ 1 గని మేనేజర్ ఆత్మారామ్ సాహ్నీ అన్నారు. గనికి చెందిన 39 మంది బదిలీ వర్కర్లు జనరల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన సందర్భంగా గురువారం వారికి పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్పత్తి, రక్షణ రెండు కళ్లుగా భావించాల న్నారు. క్రమం తప్పకుండా విధులకు హాజరై నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తూ సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో బొగ్గు నాణ్యతగా ఉంటేనే వినియోగద రులు తీసుకుంటారని చెప్పారు. ఉద్యో గులు, అధికారులు సమష్టి కృషితో బొగ్గు నాణ్యతగా ఉత్పత్తి చేస్తూ వినియోగదారుల మన్ననలు పొందిలనా సూచించారు. ఈ సందర్భంగా బొగ్గు నాణ్యతా వారోత్ స్వాల సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, పిట్ కార్యదర్శి దాడి రాజయ్య, అధికారులు చంద్రముర్మ, మోహన్‌రెడ్డి, నరేష్, శ్రీనివాస్, రాంచందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీలు చేపట్టాలి

శ్రీరాంపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లకు పైగా ఫోకల్/సెన్సిటివ్ స్థానాల్లో పనిచేస్తున్న ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల బదిలీలు వెంటనే చేపట్టాలని శ్రీరాం పూర్ జీఎం కార్యాలయ సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ విషయంపై యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ, నాలుగేళ్లకు పైగా ఫోకల్/సెన్సిటివ్ స్థానాల్లో పనిచేస్తున్న సిబ్బంది బదిలీలు చేపట్టాలని యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందన్నారు. ఆ ప్రకారం 01-06-2025 నుంచి ఈ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందన్నారు. కానీ శ్రీరాంపూర్ ఏరియాలో దీనిని అమలు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని అమలు చేయక పోవడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని చెప్పారు. తమ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొని బదిలీల గురించి యాజమాన్యంతో మాట్లాడాలని కోరారు. ఉద్యోగలకు న్యాయం జరిగేలా చూడలని విజ్ఞప్తి చేశారు. సర్క్యులర్ జారీ చేసి నెలలు గడుస్తున్నా పట్టించుకోక పోవడం సరికాదని చెప్పారు. ఉద్యోగుల ఆవేదనను అర్థం చేసుకొని యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.


సీతారామయ్యకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు

ప్రమాదంలో వాహనదారులు



దారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

జైపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పౌనూరు గ్రామంలో ఉన్న మట్టి రోడ్డును గతంలో సీసీ రోడ్డుగా మార్చారు. పౌనూరు పంచాయతీలోని దళితవాడ నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి అనువుగా రెండేళ్ల క్రితం 200 మీటర్ల వరకు సీసీ రోడ్డును నిర్మించారు. కానీ ఇటు అధికారులు, అటు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా కాంట్రాక్టర్ రోడ్డు పనులను పూర్తిచేశాడు. సీసీ రోడ్డు నిర్మించి రెండేళ్లు గడుస్తున్నా విద్యుత్ స్తంభాలను తొలగించలేదు. విద్యుత్ స్తంభాలను తొలగించకుండా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా మంత్రి వివేక్‌వెంక టస్వామి, కలెక్టర్‌కుమార్ దీపక్ స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మృతి చెందిన గొర్రెల పరిశీలన

కన్నెపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయకునిపేట గ్రామపంచాయతీలోని కుర్మగూడానికి చెందిన పెద్దల్ల వీరమల్లుకు చెందిన గొర్రెలు అకస్మాత్తుగా బుధవారం రాత్రి మృతిచెందగా గురువారం జిల్లా పశువైద్యాధికారి శంకర్ పరిశీలించారు. గొర్రెలు ఎలా మృతి చెందాయని అడిగి తెలుసుకున్నారు. వెటర్నరీ డాక్టర్ శ్వేత సంఘటన స్థలానికి చేరుకుని మృతిచెందిన గొర్రెలను పరిశీలించారు. జిల్లా పశువైద్యాధికారి శంకర్ మాట్లాడుతూ గొర్రెలు ఎలా చనిపోయాయని తెలియాలంటే ల్యాబ్‌కు టెస్టు కోసం పంపించాలని వెటర్నరీ డాక్టర్ శ్వేత కు చెప్పారు. జిల్లా కుర్మ సంఘం అధ్యక్షుడు గుంట శ్రీశైలం మాట్లాడుతూ బాధి తకుటుంబానికి న్యాయం చేయాలని, ప్రభుత్వం నష్టపరిహారం అందించాలన్నారు.

సాధనతో ఉపకారం

(5వ పేజీ తరువాయి)

పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇది ఎంతగానో ఉపయోగ పడనుంది. విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా నిరంతరం సాధనతో ప్రతిభ చాటితే ఉపకారం అందనుంది.

జిల్లాలో 1094 మంది దరఖాస్తు

జిల్లాలో ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభ పరీక్షకు 1094 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. పరీక్ష కోసం జిల్లాలో 4 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మంచిర్యాలలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, గర్మిళ్ల పాఠశాల, బెల్లంపల్లిలోని జెడ్పీ హెచ్ఎస్ బజార్ ఏరియా పాఠశాలల్లో పరీక్ష కేంద్రా లను అధికారులు ఏర్పాటు చేశారు. ఇందుకోసం నలుగురు చీఫ్ సూపరింటెండెంట్‌లను, నలుగురు డిపార్టుమెంటల్ అధికారులతో పాటు 20 మంది విద్యార్థులకు ఒక్క ఇన్విజిలేటర్ చొప్పున నియ మించనున్నారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

జైపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కట్కూరి లింగయ్య (73) అనే వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. లింగయ్య భార్య లింగమ్మ తెలిపిన వివరాల ప్రకారం లింగయ్య కొన్నేళ్ల క్రితం మామిడి చెట్టుపై నుంచి పడి నడుము విరిగింది. అప్పటి నుంచి అవస్థలు పడుతున్నాడు. గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు లింగయ్య భార్య పేర్కొంది. లింగయ్యకు కొడుకు, కూతుర్లు ఉన్నారు.

బాధిత కుటుంబానికి అండగా గ్రామస్థులు

దండేపల్లి నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం లక్ష్మీకాంతపూర్ గ్రామానికి చెందిన గాజుల సతీష్ అనే వ్యక్తి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో అతని స్నేహితులు,గ్రామస్థుల సహకారంతో రూ. 51.500 విరాళాలు సేకరించి మృతుని కుటుంబ సభ్యుల పేరిట మ్యాదరిపేటలో యూనియన్ బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేయించారు. అట్టి బాండ్ పత్రాన్ని గురువారం వారి కుటుంబసభ్యులకు గ్రామస్థులు అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో గ్రామస్థులు, మిత్రులు జాబు కాంతరావు, చిలుకూరి రాజు, మహేష్, సత్తయ్య, కాసెట్టి శంకరయ్య, పసర్తి ప్రబాకర్, కాపురపు రవి, బాదినేని లచ్చయ్య, తదితరులు ఉన్నారు.

యాసంగి సాగుకు సిద్ధం



సిద్ధం చేసిన వరి నారుమడి

ప్రణాళికను తయారు చేసిన వ్యవసాయ శాఖ

1.30 లక్షల ఎకరాల్లో పంటల సాగు ....

నస్పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజ న్‌లో సాగు చేసిన పంటలు ముగింపు దశకు చేరాయి. యాసంగి (రబీ) పంటల కోసం వ్యవసాయ శాఖ పంటల ప్రణాళికను రూపొందించింది. ఖరీఫ్‌లో సాగైన వరి పంట కోతలు ముగుస్తుండడంతో యాసంగి పనుల సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. వరి కోతలు ముగిసిన ప్రాంతాల్లో దుక్కులు దున్ని పంట భూ ములను పంటల సాగుకు సిద్ధం చేస్తున్నారు. దీని కోసం అవసరమైన ఎరువులు, విత్తనాలు ఇతరత్రా పనుల్లో రైతులు నిమగ్నమైయ్యారు. కొన్ని చోట్ల వరి కోతలు ముగియడంతో పొలాలను దున్ని నారు పోసి సిద్ధం చేశారు. యాసంగి సీజన్‌లో జిల్లాలో దాదాపు 1.30 లక్షల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పెసర, వేరుశనగ, జొన్న తదితర పంటలు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

వివిధ రకాల పంటల సాగు...

మంచిర్యాల జిల్లాలోని 16 మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో 1.30 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేసే అవకాశం ఉంది. యాసంగి సీజన్‌లో వరి పంట సుమారు లక్ష 23 వేల 292 ఎకరాలు, మొక్క జొన్న 4500 ఎకరాలు, జొన్న 409 ఎకరాలు, వేరుశనగ 275 ఎకరాలు, పెసర 584 ఎకరాలు తదితర పంటలు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో భాగంగా పంట సాగు కోసం అవసరమైన ఎరువుల కోసం వ్యవసాయ శాఖ ప్రణాళిక తయారు చేసింది.. యూరియా 17,096 మెట్రిక్ టన్నులు, డీఏపీ 6,187 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 12,616 మెట్రిక్ టన్నులు, పొటాష్ 5,126 అవసరం ఉంటుందని అంచనా. ప్రస్తుతం 5,260 మెట్రిక్ టన్నులు ఎరువులు నిల్వ ఉన్నాయి.

ఎక్కువగా వరి సాగే....

మంచిర్యాల జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుని వరి పంటను రైతులు ఎక్కువ సాగు చేస్తారు. ప్రధానంగా కడెం ప్రాజెక్టు, గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో విద్యుత్ మోటర్లు, చెరువులు, కుంటలు, బావుల ద్వారా నీటిని వరి పంట కు అందిస్తారు. వరి పంట తర్వాత మొక్క జొన్నకు ప్రాధాన్యత ఉంది. ఇందుకు కావాల్సిన వ్యవసాయ పనుల్లో రైతన్న బీజీబీజీగా ఉన్నారు.

యాసంగి సాగుకు ఏర్పాట్లు చేస్తున్నాం

సురేఖ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు ముగుస్తున్నాయి. యాసంగి సాగుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నాం. క్షేత్ర స్థాయిలో వెళ్లి రైతులకు పంటల సాగుపై సూచనలు సలహాలు ఇస్తున్నాం. ఏ నేలలో ఎలాంటి పంటలు వేయాలో చెబుతున్నాం. దిగుబడులు పెంచుకునేందుకు రైతులకు సలహాలు ఇస్తున్నాం.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సతీష్‌కుమార్

కాసిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీల్లో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని డీఎల్‌పీవో సతీష్‌కుమార్ సూచించారు. గురువారం కాసిపేట గ్రామపంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పారిశుధ్య సిబ్బంది మురుగుకాలువలను, రోడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. ఇంటింటికీ చెత్తను సేకరించి ట్రాక్టర్ ద్వారా సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి, తడి, పొడి చె త్తను వేరు చేసి కంపోస్టు ఎరువు తయారు చేయాలన్నారు. కాసిపేటలోని వైకుంఠదామాన్ని పరిశీలించి పిచ్చి మొక్కలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో షేక్ సప్దర్‌అలీ, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి

షెడ్యూల్ కులాల అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు

లక్సెట్టిపేట, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు అన్ని వసతులు సక్రమంగా కల్పించాలని షెడ్యూల్ కులాల అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం సాయంత్రం అయన పట్టణంలోని పలు వసతిగృహాలను సంబందిత అధికారులతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. వసతిగృహాల్లో విద్యార్థులకు హెచ్‌డబ్లువోలు అందజేస్తున్న భోజనంతో పాటు ఇతర సౌకర్యాలపై ఆరా తీసారు. అంతే కాకుండా కిచెన్, స్టోర్ రూం, వాష్‌రూమ్స్, డైనింగ్ హాల్స్‌లను పరిశీలించారు. విద్యార్థుల రోజువారి హాజరు పరిశీలించిన ఆయన ప్రతీరోజు అటెండెన్స్‌ని ఆన్‌లైన్‌లో క్రమం తప్పకుండా నమోదు చేయాలని వార్డెన్స్‌ని ఆదేశించారు. విద్యార్థులు ఇప్పటి వరకు నేర్చుకున్న పాఠాలను అడిగి తెలుసుకు న్నారు, అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా వసతిగృహాలను తనిఖీ చేస్తామన్నారు. విద్యార్థులకు ప్రతీ రోజు ప్రభుత్వం నిర్ణయిం చిన మెనూ ప్రకారం భోజనంతో పాటు అల్పాహారం అందించాలని అవి కూడా నాణ్యతతో ఉండాలన్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు కావాల్సిన అవసరాలు వసతుల ఇండెంట్ తెలియజేయాలని అధికారులకు సూచించారు.

ఈకార్యక్రమంలో ఆయన వెంట ఎఎస్‌డబ్లువో దర్మానంద్‌గౌడ్, ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చాతరాజు దుర్గాప్రసాద్ ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్

గంజాయి పట్టివేత

వేమనపల్లి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామంలో గురువారం ఇంటిలో ఉన్న 550 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు చెన్నూర్ సీఐ హరి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బుయ్యారం గ్రా మంలోని మల్లీఖార్జున్ అనే వ్యక్తి ఇంటిలో సోదాలు నిర్వహించగా పెరడులో దాచి ఉంచిన 550 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు.

దుప్పట్లు పంపిణీ

కాసిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గిరిజన గ్రామాల్లో పెరిగిన చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని దేవాపూర్‌కు చెందిన భూనేని చంద్రశేఖర్ బుధవారం రాంపూర్‌లోని గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అటవీ సమీప గ్రామాల్లో చలి తీవ్రత విపరీతంగా పెరిగిందని, చలి బారి నుంచి కాపాడుకు నేందుకు నిరుపేద గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్న విషయాన్ని తెలుసుకుని సంస్థ ద్వారా 25 కుటుంబాలకు దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. మున్ముందు కూడా సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, ప్రవీణ్, ప్రసాద్, జుబేదార్, సతీష్, రాములు, మోతిరాం తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత వార్షికోత్స దినోత్సవ వేడుకలో భాగంగా దండేపల్లిలో 30 మంది దీన నారాయణ వృద్దులకు లక్సెట్టిపేట సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దండేపల్లి శ్రీసత్య సాయి భజన మండలి కన్వీనర్ రాపర్తి రాజన్న, సమన్వయకర్తలు పసుపునూటి సాయిరాం, కుమారస్వామి గౌడ్, సభ్యులు లచ్చన్న, దుర్గం గురువయ్య, సాయిని అశోక్. శంకర్ పాల్గొన్నారు.

కాలబైరవ స్వామికి ఎమ్మెల్యే పూజలు

బెల్లంపల్లి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్‌లో గల కాలబైరవ స్వామి దేవాలయంలో గురువారం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో పాటు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయ నతో పాటు నాయకులు కారుకూరి రాంచం దర్, నాతరి స్వామి, రమేశ్‌లు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి నిర్మించుకోవాలి

జైపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నియమ నిబంధనలకు లోబడి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని జేజీఎం(పీ) హెచ్‌యూ డీసీవో జనార్ధన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఇందారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట హౌజింగ్ పీడీ బన్సీలాల్, ఏఈ కాంక్ష, పంచాయతీ కార్యదర్శి సుమన్ ఉన్నారు.

జగిత్యాల -మంచిర్యాల హైవేకు రైట్ రైట్...

(5వ పేజీ తరువాయి)

నిర్మించుకున్న ఇళ్లు కూల్చివేతకు గురవుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు సర్వే పనులను అడ్డుకోవడం, భూములు ఇచ్చేం దుకు నిరాకరిస్తూ పలు రకాల ఆందోళనలు నిర్వహించారు. దీనికి స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు మరో రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. కొత్త అలైన్‌మెంట్‌తో జీవనా ధారామైన సాగు భూములను సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ అలైన్‌మెంట్ ప్రకారం లక్సెట్టిపేట మండలం మీదుగా గోదావరి నదికి సమాం తరంగా పంట పొలాలు, చేల మీదుగా రహదారి నిర్మాణం జరగాల్సి ఉంది. గతంలో ఈ ప్రాంత రైతులకు చెందిన భూములు పెద్ద ఎత్తున శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద ముంపునకు గరయ్యాయి. మిగిలిన కొద్ది పాటి భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

మళ్లీ రహదారి నిర్మాణం కోసం తమ భూములు సేకరిస్తుండటంతో వారంతా ఆందోళన బాట పట్టారు. తమకు నష్టం కలిగించే రూట్ మ్యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులకు విన్నవించారు. చివరి యత్నంగా హై కోర్టును సైతం ఆశ్ర యించారు. హై కోర్టు మధ్యంతర ఉత్తర్వులతో తాత్కాలికంగా రహదారి నిర్మాణానికి బ్రేకులు పడగా, నూతన అలైన్‌మెంట్ రూపొందించి, అధికంగా భూ సేకరణ అవసరం లేకుండానే జన సంచారం అధికంగా ఉన్న చోట బైపాస్ నిర్మాణాలతోపాటు మిగతా చోట్లా పాత రహదారిని విస్తరించేం దుకు మార్గం సుగమం అయింది.

రహదారి నిర్మాణంలో....

ఎన్‌హెచ్-63 నిర్మాణంలో భాగంగా ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల వరకు మొత్తం 131.8 కిలోమీటర్ల మేర సాగనుంది. ఇందుకు అవసరమైన ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఇప్పటికే సేకరించారు.

అలాగే పలు నిర్మాణాలు కోల్పోతున్నాయి. రహ దారి నిర్మాణంలో భాగంగా 178 కిలో మీటర్ల ప్రభుత్వ భూములు అవసరం అవుతుండగా, 1317 ఎకరాల ప్రైవేటు భూములను సేకరించారు. మరో 38.05 కిలో మీటర్ల అటవీ భూములు సైతం రోడ్డు నిర్మాణంలో భాగం కానున్నాయి. మొత్తం 131.8 కిలోమీటర్ల పొడవులో 135 నిర్మాణాలు కూల్చివేతకు గురవుతుండగా, 162 కుటుంబాలు నిర్వాసితులు కానున్నాయి.

చేప పిల్లల పంపిణీ



ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తున్న ఆత్మ చైర్మన్ సత్తయ్య

కాసిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కుల వృత్తులను ప్రోత్సహించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందని ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి ఆయనహాజరై పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మత్స్య సంపదను పెంపొందించి పోషకాహార లోపాన్ని నివారించేందుకు చేప పిల్లల పంపిణీ దోహదం చేస్తుందన్నారు. మత్స్యరంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. మండలంలోని 9 చెరువులకు 4.44 లక్షల చేప పిల్లలను ఉచితంగా అందజేశామన్నారు. మత్స్యకారులు చేప పిల్లలు పెరిగేలా చూసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఝైదం రమేష్, స్వామి, ఫిరోజ్‌ఖాన్, జాడి శంకర్, ప్రశాంత్, రాజేష్, శ్రీనివాస్, నరేష్, నర్సయ్య పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

కాసిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గని పని స్థలాల్లో కార్మికులు అప్రమత్తంగా ఉంటూ రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని బెల్లంపల్లి రీజియన్ జనరల్ మేనేజర్ రఘుకుమార్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భూశంకరయ్య అన్నారు. గురువారం కాసిపేట 2వ గనిలోని 3వ సీం సౌత్ డిస్టిక్ బూగర్భ పని స్థలాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పని స్థలాల్లో కార్మికులు అప్రమత్తంగా ఉంటూ బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ మేనేజర్‌రవిశంకర్, సర్వే ఆఫీసర్ తిరుపతి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నెన్నెల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి గ్రామానికి చెందిన సున్నం చిన్నక్కకు రూ. 48 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు గురువారం అందజేశారు. అనారోగ్యం పాలై చికిత్స కోసం చేసిన ఖర్చులు చెల్లించాలని ఆమె దరఖాస్తు చేసుకోగా సీఎం సహాయ నిధి నుంచి డబ్బులు మంజూరు కావడంతో ఆమె ఇంటికి వెళ్లి చెక్కును ఇచ్చారు. వైద్యం కోసం వేల రూపాయలు ఖర్చు చేసుకున్న బాధిత కుటుంబాలకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు సీఎంఆర్‌ఎఫ్ ఉపయోగ పడుతుందని మాజీ ఎంపీటీసీ దాగం రమేష్ పేర్కొన్నారు. డీసీసీ సభ్యులు లావుడ్య రమేష్, నాయకులు ఓరెం రామ్, దుగుట రమేష్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగంగా నిర్మించుకోవాలి

మందమర్రిరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లను వేగంగా నిర్మించుకోవాలని డీఈ మునీందర్ పేర్కొన్నారు. గురువారం చిర్రకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడు తూ ప్రభుత్వం పేద ప్రజల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిందని, లబ్ధిదారులు సకాలంలో నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్, ఏఈ జ్యోత్స్న, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాలయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

సమీక్ష సమావేశంలో కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో రోడ్డు బధ్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహనాల నిలుపుదల, నిబంధనల ఉల్లంఘటన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై తక్కువ ఎత్తులో గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటి ఉన్న చోట్ల లైటింగ్‌ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో జాగ్రత్త సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రహదారుల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలన్నారు. రోడ్ల భద్రతపై అవగాహన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌మనోజ్, రెవెన్యూ, రవాణా, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

జిల్లాలో ఆయిల్‌ఫాం సాగు విస్తీర్ణాన్ని పెంచాలి

జిల్లాలో ఆయిల్‌ఫాం సాగు విస్తీర్ణాన్ని పెంచాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగుతో కలిగే లబ్ధిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పాం పంట సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 438 ఎకరాల్లో సాగవుతోందని, సంబంధిత అధికారుల సమన్వయంతో కృషి చేసి మిగితా లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఆయిల్‌పాం సాగులో ఆదాయం ఉంటుందని, ఈ వినయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. అలాగే పత్తి, వరి కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల మేరకు కొనుగోలు చేయాలన్నారు. పంట ఉత్పత్తులను సకాలంలో కొనుగోలు చేసి చెల్లింపులు చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం జాతీయ స్థాయి జల పురస్కారాల్లో మంచిర్యాల జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చినందుకు కలెక్టర్‌ను అధికారులు ఘనంగా సన్మానించారు. అదనపు కలెక్టర్ చంద్రయ్య, జిల్లా వ్యవసాయాధికారి సురేఖ ఉన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

కాసిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు గురువారం పెద్దాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించారు. స్థానిక గిరిజన నాయకులు మహేష్, కొడప బీంరావు, కుడిమేత విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, లక్ష్మయ్య, నవీన పాల్గొన్నారు.

బడి బయట పిల్లల సర్వే

తాండూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ మండలంలో గురువారం బడిబయట పిల్లల సర్వే నిర్వహించిన ఎంఈవో మల్లేశం తెలిపారు. సర్వేలోకారణాలను తెలుసుకుని సమీపంలో ఉన్న పాఠశాలలో చేర్పిస్తామన్నారు. 6 నుంచి 14 ఏళ్ల పిల్లలను, 15 నుంచి 19 ఏళ్ల పిల్లలను గుర్తించి పాఠశాల, కళాశాలల్లో చేర్పిస్తామన్నారు.

'గాంధీ'లో ఏడేళ్ల బాలుడికి లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్స

అడ్డగుట్ట, నవంబర 20 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో ఏడేళ్ల బాలుడికి మొదటి సారిగా లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్స చేశారు. పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి నాగార్జున మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా, భీమిని మండలం, అక్కినపల్లి గ్రామానికి చెందిన అఖిల్ అనే ఏడేళ్ల బాలుడు ప్లీహం పెరగడం, తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నాడు. ప్రతీవారం రక్తమార్పిడి చేయాల్సి వచ్చేది. బాలుడిని కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించి లాప్రోస్కోపిస్ శస్త్రచికిత్స చేశామని, ప్రస్తుతం బాలుడు కోలుకున్నాడని డాక్టర్ నాగార్జున తెలిపారు.

రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం

బెల్లంపల్లి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ రోడ్డు విస్తరణ పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో సిబ్బంది పనులను చేపట్టారు. రహదారి మధ్య నుంచి 30 ఫీట్ల వెడల్పు లోపల ఉన్న కట్టడాలను కూల్చివేశారు. దీనితో పలువురు ఆస్తిధ్వంసం అవుతుందని ఆవేదనతో పాటు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని రోజుల క్రితమే మార్కింగ్ చేసి నోటీసులు ఇచ్చామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కాసిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ పురుషోత్తం నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం రేగులగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో విద్యార్థులు చన్నీటితో స్నానం చేయడానికి తీవ్ర అవస్థలు పడతారని, కాబట్టి వేడి నీటి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే చలి బారి నుంచి కాపాడుకునేందుకు రగ్గులు, బ్లాంకెట్లు, దుప్పట్లు అందజేయాలన్నారు. విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి వారి చదువులను మెరుగు పర్చా లన్నారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులందరు సమిష్టిగా పనిచేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాలలో మంచినీటి ప్లాంటును పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ పురుషోత్తం నాయక్

శ్రావణి కుటుంబానికి న్యాయం చేయాలి

కాగజ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుల దురహంకార హత్యకు గురైన శ్రావణి కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ నాయకు డు ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. శ్రావణి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 22న జిల్లాలో కేంద్రంలో నిర్వహించే చలో కలెక్టరేట్ పోస్టర్లను గురువారం ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల దురహంకార హత్య జరిగిన ప్పటికీ ఇంత వరకు ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. శ్రావణి కుటుంబానికి రూ.25లక్షలు పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రూప్-2 ఉద్యోగికి సన్మానం

రెబ్బెన, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని జీఎం కార్యాయంలో సింగరేణి ఉద్యోగం చేస్తూ పట్టుదలతో గ్రూప్-2లో ఉప తహసీల్దార్ కొలువు సాధించిన బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహరా, మదీనా బాషా, హెచ్‌ఓడీ శ్రీనివాస్, ఎన్విరాలమెంట్ అధికారి హరీష్, ప్రశాంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

దహెగాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల సమీపంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ సీఈవో బక్కయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారని రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



కౌలు..కన్నీళ్లు..

- ఆగం చేసిన వర్షాలు
- దెబ్బతిన్న పంటలు
- తగ్గిన దిగుబడులు
- అందని ప్రభుత్వ రాయితీలు
- భరోసా పథకం అమలు చేయని సర్కార్
- అప్పులు తప్ప మిగిలిందేమీ లేదని కౌలు రైతుల ఆవేదన

బెజ్జూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కౌలు రైతులు పుట్టెడు కష్టాలు పడుతున్నారు. వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడం, కౌలు ధరలు గణనీయంగా పెరగడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు వర్తించక పంటలు దిగుబడి రాక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో కురిసిన అధిక వర్షాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. దిగుబడులు గణనీయంగా తగ్గడంతో కౌలు రైతులు కుదేలయ్యారు. ప్రభుత్వం కౌలు రైతులకు భరోసా పథకాన్ని అమలు చేసి ఉంటే తమకు కాస్తా ప్రయోజనం కలిగేదని చెబుతున్నారు. నిజానికి కౌలు రైతులను ఆదుకునేందుకు ఏటా ఆర్థిక సాయం అందజేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ప్రకటించింది. అందుకు వ్యవసాయ శాఖ ద్వారా కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ చేపడుతామని చెప్పినా ఆచరణకు నోచు కోవడం లేదు. సాధారణ పట్టాదారులైన కర్షకుల మాదిరిగానే తమకూ భరోసా వస్తుందని కౌలు రైతులు ఆశించారు. కానీ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా పథకం అమలుపై ఎలాంటి నిర్ణయం లేకపోవడంతో వారికి కన్నీరే మిగిలింది.

4.26 లక్షల ఎకరాల్లో పంటలు..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 4.26లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఇందులో 3.50 లక్షల ఎకరాల్లో పత్తి, 56వేల ఎకరాల్లో వరి, 20వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు అవుతున్నాయి. జిల్లాలో సుమారు 20వేల మంది కౌలు రైతులు ఉన్నారు. ఏటా వేల సంఖ్యలో రైతులు భూములు కౌలుకు తీసుకొని వివిధ పంటలు పండిస్తున్నారు. వరి సాగు చేసే అన్నదాతలకు ప్రభుత్వం సన్నరకం ధాన్యంపై రూ.500బోనస్ ప్రకటించడంతో కౌలు ధరలు ఆకాశన్నంటాయి. ఎకరానికి రూ.20వేల వరకు కౌలు చెల్లించాల్సి వస్తోంది.

గతంలో జిల్లాలో కౌలు ఎకరాకు రూ.10వేల నుంచి రూ.15వేలకు పలకగా, బోనస్ కారణంగా కౌలు ధరలకు రెక్కలొచ్చాయి, పంట దిగు బడితో సంబంధం లేకుండా రైతులు కౌలు చెల్లించాల్సి వస్తోంది. ఏటేటా ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోయి దిగుబడి తగ్గుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

అందని ప్రభుత్వ పథకాలు..

కౌలుకు భూములు తీసుకొని సాగుచేసే రైతులకు ప్రభుత్వం అందించే ఏ పథకాలు కూడా అందడం లేదు. సాగుకు బ్యాంకుల్లో రుణాలు అందవు, రైతుబంధు, రైతుబీమా, యాంత్రీకరణ పథకాలు కూడా వారి దరిచేరవు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన సందర్భంలో వారికి పరిహారం కూడా రాని పరిస్థితి. గతంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు కూడా ప్రకటించారు. కానీ ఇప్పటికీ ఆ ఊసే లేదు. దీంతో వారు అన్ని పథకాలకు దూరంగానే ఉన్నారు.

పెట్టుబడి కూడా రాలేదు..



పేదం సాయికుమార్, రైతు, పెద్దసిద్దాపూర్

ఈ ఏడాది నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాను. ఎకరానికి రూ.18 వేలు కౌలు చెల్లించాను. ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి రావాల్సి ఉంది. కానీ వర్షాలకు పంట దెబ్బతిని కేవలం ఐదు క్వింటాళ్లలోపే వచ్చింది. దీంతో కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉంది.

వర్షాలతో తగ్గిన దిగుబడి..



కోర్తే వెంకటి, రైతు

కౌలుకు తీసుకున్న భూమిలో పత్తి సాగు చేయ గా ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంట పూర్తిగా దెబ్బతిన్నది. వర్షాలకు పంట తెగుళ్ల బారిన పడింది. దీంతో దిగుబడులు తగ్గడంతో పెట్టుబడి కూడా రాలేదు. ప్రభుత్వం ఆదుకొని కౌలు రైతులకు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

కాగజ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. కాగజ్‌నగర్ మార్కెట్‌తో పాటు పలు వార్డుల్లో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యవసర సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పెండింగ్ సమస్యలు కూడా దశల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు పంపిణీ చేసిన కల్యాణలక్ష్మి చెక్కులు

సిర్పూర్(టి), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కును ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులు తమ అకౌంట్లలో జమ చేసుకుని లబ్ధి పొందాలన్నారు. ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులు త్వరిగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. డబుల్ రోడ్డు విస్తరణకు గ్రామస్థులు, వ్యాపారులు సహకరించాలన్నారు. ఆసిఫాబాద్ నుంచి మాకిడి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.70 కోట్లు మంజూరు చేసిందని అన్నారు. ఇందులో కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు నుంచి సిర్పూర్(టి) వరకు, సిర్పూర్(టి) నుంచి మాకిడి వరకు రోడ్డు విస్తర్ణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇందులో సెంట్రల్ లైటింగ్ కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. త్వరలో టెండర్ పూర్తి కానుందని తెలిపారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన 23 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఆర్‌ఐలు స్వప్న, ప్రవీణ్, వేణు, బీజేపీ నాయకులు లావణ్య, విలాస్, సాయి, ప్రవీణ్, అశోక్, శ్యాంరావు తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్ల అంశం తేల్చాలి



రాస్తారోకో చేస్తున్న నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అంశం తేలిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రూప్‌నార్ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను వంచించి రిజర్వేషన్ ఇస్తానంటూ ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రిజర్వేషన్ కాకుండా ఎన్నికలకు వెళ్తామంటూ ప్రచారం చేయడం సరికాదన్నారు. రానున్న రోజుల్లో బీసీలు కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. బీజేపీ ఎంపీలు తక్షణమే బీసీ బిల్లుపై పార్లమెంట్‌లో ప్రస్తావన తేవాలని కోరారు. లేని పక్షాన బీజేపీ ఎంపీలను రాష్ట్రంలో తిరగనీయకుండా చేస్తామని హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుంటే ఊరుకునేది లేదని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ప్రణయ్, వెంకన్న, మారుతి, లవ్‌కుమార్, శ్రీనివాస్, ఆనంద్, శంకర్, శ్రీకాంత్, కిరణ్, సాయికృష్ణ, యాదగిరి, మోతిరావ్, నాందేవ్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దహెగాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని చిన్నరాస్పెల్లి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికవడంతో గురువారం ప్రధానోపాధ్యాయురాలు సునీత, పీడీ రవి అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలు సునీత మాట్లాడుతూ కాగజ్‌నగర్ పట్టణంలోని రాంమందిర్ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 18న స్కూల్ గేమ్స్ ఫెరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన అండర్-17 విభాగంలో విద్యార్థులు సందీప్, కాశీదాస్ ప్రతిభ చాటి జోనల్ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 21న ఆదిలాబాద్‌లో నిర్వహించే జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓటరు సవరణ జాబితా విడుదల

సిర్పూర్(టి), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) ఎంపీడీవో కార్యాల యంలో రాష్ట్ర ఎన్నికల ఆదేశాల మేరకు గురువారం ఎంపీడీవో సత్యనారాయణ గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను ప్రచురించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా అభ్యంతరాలు, మార్పులు చేర్పులు ఉంటే సరి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో వినోద్, సూపరింటెండెంట్ సదాశివ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఆసిఫాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక ఉప కేంద్రాలకు వివిధ అనారోగ్య సమస్యలపై వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గురువారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఏరియా ఆసుపత్రి, సామాజిక ఆరోగ్య ఉప కేంద్రాలలో ఒప్పంద పద్ధతిన వైద్యులుగా పని చేయడానికి నిర్వహించిన ఇంటర్వ్యూ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సీతారాం, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, తెలంగాణ వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త అవినాష్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు అనిల్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒప్పంద పద్ధతిన ఎంపికైన వైద్యులు ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వేగవంతమైన సేవలు అందించాలన్నారు. భౌగోళికంగా జిల్లా పరిధి ఎక్కువగా ఉన్నందున మారు మూల ప్రాంతాలలో ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు అందించాలని చెప్పారు. ప్రజ లతో మర్యాదగా మెలుగుతూ విధుల పట్ల సమయపాలన పాటించాలని సూచించారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకరావాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రలోని గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాల మైదానంలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమ తులను, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడా రంగాన్ని అభివృద్ధి చేస్తూ అనేక సౌకర్యాలు కల్పించి క్రీడకారులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ అధ్వర్యంలో ఊట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఆసిఫా బాద్, జైనూరు, కాగజ్‌నగర్, మంచిర్యాల జోన్‌ల పరిధిలోని 14-17 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలబాలికలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్యారమ్, చద రంగం, టెన్నికాయిట్, అర్చరీ పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. క్రీడాకారులు గెలుపు ఓటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడం అబినందనీయమని తెలిపారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. నిరంతర సాధన ద్వారా ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో డీడీ రమాదేవి, జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి మల్లికార్జున్, జిల్లా గిరిజన క్రీడల అధికారి శేకు, ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, పీడీ మీనారెడ్డి, కోచ్‌లు అరవింద్, విద్యాసాగర్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ రద్దు చేయాలి

కెరమెరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల కోసం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేయాలని ఆదివాసీ నాయకులు గురువారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. శాన్వి సర్వీసెస్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ పేరుతో ఇటీవల విడుదలైన ఉద్యోగ ప్రకనను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కోవ విజయ్ భీంరావు, జగ్గేరావు, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక

చింతలమానేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న రౌతు విష్ణువర్ధన్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో నిర్వహించిన పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడంతో ఎంఈవో జయరాజు, ఇన్‌చార్జి హెచ్‌ఎం చానేష్, పీడీ హరీష్ అభినందించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



బహుమతులు ప్రదానం చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాయాలు విజ్ఞాన నిలయాలని, పాఠకులు, విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవస రమైన విజ్ఞానం గ్రంథాయాలలో లభిస్తుందని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ శాఖలో గురువారం నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే హరీష్‌బాబుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మన అందరికి అవసరమైన విజ్ఞానం లభిస్తుందని తెలిపారు. గ్రంథాలయాలలో పాఠకుల కోసం, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థు లకు చరిత్రకు సంబంధించిన పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పోటీ పరీక్షల అభ్యర్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠకుల కోసం మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. పాఠకులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సరిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్లాలి



ఆసిఫాబాద్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యంతో ముందుకు సాగాలని జిల్లా సంక్షేమాధికారి, డీసీపీవో మహేష్ అన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఆసిఫాబాద్ మండలంలోని అంకుశాపూర్ ఎంపీయూపీఎస్ పాఠశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమాధికారి, డీసీపీవో మహేష్‌తో కలిసి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకొని ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ కార్యక్రమంలో సిబ్బంది బాలప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్, జమున, రవళి, వెంకటేశ్వర్లు, రాణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని ఎంఈవో హను మంతు అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. ముత్తంపేట పాఠశాలలో ఎంఈవో హను మంతు హాజరై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ ఏజెన్సీలో చలి పంజా



పొగమంచులో లైట్లు వేసుకుని వెళుతున్న వాహనదారుడు

ఆసిఫాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో చలి వణికిస్తోంది. పదిహేను రోజులుగా జిల్లాలో చలి తీవ్రత పెరిగి పోతుండడంతో ఏజెన్సీ గ్రామాలు చలికి గజగజలాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా శీతలగాలులతో పాటు ఉదయం పొగమంచు కమ్మేస్తోంది గురువారం సిర్పూర్ (యు)లో 8.0 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. తిర్యాణిలో 8.5, కెరమెరిలో 9.6, వాంకిడిలో 11.3, జైనూరులో 11.4,చింతలమానేపల్లిలో 11.6, కాగజ్‌నగర్, రెబ్బెన మండలాల్లో 11.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.